# ఆనందభైరవి

ఒక్కో శుభం వెనుక ఎంతో కొంత అశుభం కూడా ఉంటుందని ధర్మపాలునికి ఇప్పటిగ్గానీ తెలిసిరాలేదు. అది తెలిసివచ్చినతరువాత అతనుపడ్డ పాట్లు ఎంతో విచారించ దగ్గవి. తలవనితలంపుగా యుద్ధం రావటమూ, ఇష్టంలేక పోయినా ఆ యుద్ధంలో పాల్గొనటమూ, పాల్గొన్నా గెలవడం అసంభవమని ముందుగానే రూఢి చేసుకొన్నప్పటికీ, అదృష్టవశాత్తూ విజయంసాధించడమూ జరిగింది. ఆలోచిస్తే ఇందులో సంతోషకారణం కానిదంటూ ఏదీలేదు. కాబట్టే తను విజయోత్సవం బ్రహ్మాండంగా చేసుకొన్నాడు. శత్రు దేశాన్నుండి కొల్లగొట్టినసంపద చూపుతూ ప్రజలందరికీ ప్రదర్శించాడు. పనిగట్టుకొని తన సామంతరాజులనందరినీ ఆహ్వానించాడు. ఈ ఆహ్వానం వెనుక మంత్రిగారి ఆలోచన చాలాఉన్నది. ఈ యుద్ధంలో—పరోక్షంగానూ, ప్రత్యక్షం గానూ, తమకు సాయపడలేమన్నవారు చాలామంది ఉన్నారు. విధిగా ఓడిపోయే రాజుపక్షం వహించటానికి వారైనా అంత తెలివితక్కువవాళ్ళు కాదు మరి. కానీ ఎవ రనుకొన్నట్లూ జరగలేదు. ఆకస్మికంగా విజయంలభించింది. దానితో సామంతరాజులగుండెలు గుభేలుమన్నాయి. ధర్మ పాలుడు—పైకి కనుపిస్తున్నంత మామూలు రాజు కాడను కొన్నారు.

నిజమే మరి—

వారెవరికీ వీరవర్మ చేసిన సాయం తెలియదు. ఆ పద్ధతి నవలంబించడంవల్ల పని సానుకూలపడుతుందనికూడా ఎవ్వరూ—చివరికి తనుసైతం ఊహించలేదు. వీరవర్మ - తన ఆధిపత్యంక్రింది సైనికులకు, శత్రుసైనికుల వేషాలు వేయించి, వారిసైన్యంలో ప్రవేశపెట్టి, అర్ధరాత్రి గొంతు కలు కోయించాడు. ముఖ్యులైనవారిని బందీలుగా పట్టు కొన్నాడు. దానితో శత్రుసైనికులు చెల్లాచెదరుకావడమూ, ఆ రాజ్యం తన పాదాక్రాంతంకావడమూ, ఇట్టే జరిగి పోయింది. ఇక అడవులపాలు కావడంకన్న గత్యంతరం లేదనుకొంటున్న సమయంలో, వీరవర్మ చేసిన ఈ మహా కార్యం తనను రక్షించింది. లేకపోతే, తనూ,తనరాజ్యమూ నామరూపాలులేకుండా పోయేవనడం నిర్వివాదం! ఇందుకు ఆజన్మాంతం తను వీరవర్మకు కృతజ్ఞతాబద్ధుడయి ఉండవల సిందే! అది కనీసధర్మంకూడానూ!

కానీ ఈ ధర్మాన్నుండి తనను చ్యుతుణ్ని చేసింది సునంద. ఆ మహోత్సవాలసందర్భంలో ఆవిడ తనకంట పడకుండా ఉండవలసింది. పడినా ఆవిడపై తన కలాంటి భావం రాకుండా ఉండవలసింది. ఐతే ఈ రెండూ జరగలేదు.

సునందసౌందర్యం తనను ఉన్మత్తుణ్ణిచేసినప్పుడు, ఆవిడ పేరు సునందని తనకు తెలియదు. ఎవరో మామూలుస్త్రీగానే తను చూచాడు. ముందుగా తెలిసినట్లయితే, సునంద పొందును తను అభిలషించేవాడు కాదేమో? ఎవ్వరో తెలీని వారిని కోరడానికీ, ఫలానావారి తాలూకని తెలిసినతరువాత కోరడానికీ ఎంతో భేదమున్నది. అలా తెలియకపోవడం తన

తప్పుకాదు. తెలుసుకొనే అవకాశంలేకుండా చేసిన భగవంతుని దా తప్పు.

ఒకరకంగాచూస్తే సునందగూడా తనను ప్రేమిస్తున్నదేమోనన్న ఆలోచన కలుగుతున్నది. వీరవర్మ భార్యఅని తెలియకముందు తనుపంపిన కానుకలు; ప్రారంభంలో అవసరంలేదన్నా - తరువాత తీసుకొన్నది. ముక్కు ముఖమూ ఎరగని ఓ కొత్తవాడుపంపిన కానుకలు తీసుకోవడమనేది— త్రోసిపారేయవలసిన విషయంకాదు ఏదోరకమైన సద్భావం లేనిదే, ఇలాంటివి జరగవని తనఅనుభవం చెబుతున్నది ...ఏమో తను అనుకొంటున్నది నిజం కాకపోవచ్చు. కానుకలుపంపింది మహారాజు కనుక - తిరస్కరించడమనేది ఏవిధంగానూ క్షేమంకాదు గనుక, సునంద వాటిని స్వీకరించి ఉండవచ్చు. అందునా తనభర్త, అనూహ్యమయిన పద్ధతులద్వారా రాజ్యానికి విజయలక్ష్మిని చేకూర్చిపెట్టాడు. కృతజ్ఞతాసూచకంగా ప్రభువు పంపినవాటిని, కాదనటమంటే, అది ప్రభువును కించపరిచినట్లే కాగలదన్న నమ్మకంతోనే సునంద వాటిని అందుకొని ఉండగూడదా ?

నిజమేగానీ, ఇందులో యదార్థం అంతగా లేదనిపిస్తున్నది. కృతజ్ఞతాసూచకంగా ప్రభువుపంపే కానుకలు - భర్తకంటపడకుండా, రహస్యంగా, ఇవ్వవలసినఅవసరం లేదు. రాజోచితంగా, బహిరంగంగానే ఇవ్వవచ్చు. కానీ అలాఇవ్వడంజరగలేదు. వీరవర్మ కార్యార్థియై గ్రామాంతరం వెళ్ళినప్పుడు, ఎవ్వరూచూడకుండా, అవి అందించబడ్డాయి. సునంద కొన్నిక్షణాలు - తటపటాయించిందనీ, కొసకు

దీర్ఘంగానిట్టూర్చి, తలవంకిస్తూ స్వీకరించిందనీ, చేటిక తెలియచేసింది. ఇప్పు డేమనుకోవాలి ?

అదీగాక —

సునంద, వీరవర్మ ధర్మపత్ని కాదన్న వార్తలుగూడా తను విన్నాడు. ఎందుకనో, ఆ వార్త నిజమనికూడా అని పిస్తున్నది. వీరవర్మ తనకొలువులో చేరేనాటికి, అతను వివాహితునిలా లేడు. దేశద్రిమ్మరిలా, క్షుధాపీడితునిలా ఉన్నాడు. ఉద్యోగార్థం దేశదేశాలూ గాలించివచ్చినట్టు, తనతో చెప్పుకొన్నాడు. ఏ రాజూ ఇవ్వలేని ఉద్యోగం తను ఇచ్చాడన్న పేరు దక్కించుకొనేందుకే వీరవర్మకు తను ఆస్థానంలో ఉద్యోగమిచ్చాడు. అతనిమాటలద్వారా వ్యక్తమయ్యే - అతగాడి గతజీవితాన్నిబట్టి చూస్తే—సునంద లాంటి సౌందర్యకాణాచి, అతనికి భార్యగావటం అసంభవం! వీరవర్మగూడా తనకు కుటుంబమున్నట్టు చెప్పినజ్ఞాపకం తనకులేదు...అబ్బే! అతను తనతో ఆ విషయమే ప్రస్తావించలేదు. కాగా, కొలువులోచేరిన తరువాత, అతను వివాహమాడినట్లు రుజువుసైతం లేదు. తనతోసహా అందరూ అనుకొంటున్నదల్లా, అతను అవివాహితుడనేను.

ఏది ఏమైనప్పటికీ తను వీరవర్మకు చేస్తున్న ద్రోహ మేమీ లేదనవచ్చు. సునంద అగ్నిసాక్షిగా పెండ్లాడినభార్య కాదు. ఒక వేళ అయినా తప్పులేదు. ఎందుకంటే, ఈ రాజ్యంతోబాటు, ఇందులోని ప్రజలుగూడా తనవారే! తన ప్రజలను తను...తప్పుకాదే!

* * *

పంపే కానుక అందుకొంటున్నది. సందేశాలు స్వీకరిస్తున్నది. కానీ అంతకుమించి మరే అభివృద్ధీ కనిపించటం లేదు. ధర్మపాలునికి తొందరతోబాటు, విసుగుకూడా పుడుతున్నది. ఇక మధ్యవర్తులతో లాభంలేదనుకొన్నాడు. స్వయంగా తనే వ్యవహరించాలనుకొన్నాడు. అందుకే వీరవర్మను దూరదేశం పంపించాడు. ఈపాటి కతగాడు చాలా దూరం పోయిఉండాలి ... జనసంచారంగూడా తగ్గిపోయింది. తనకోసం సునంద ఎదురుచూస్తూ వుంటుంది. ఇంకా జాగుచేసి సునందను విసుగెత్తించడం బావుండదు.

సాధారణంగా ఇలాంటి సందర్భాలలో కాముకుల ఊహాలు అసత్యస్తంగానూ, ఆత్మవంచనాపూరితంగానూ ఉండటం అత్యంత సహజం. అదృష్టవశాత్తూ ధర్మపాలుని ఊహాలు అలాలేవు.

నిజంగా సునంద అతనికోసం ఎదురుచూస్తున్నదానిలాగానే ఉంది. మారువేషంలోవచ్చిన రాజును గుర్తుపట్టలేక కొన్నిక్షణాలు తికమకపడినమాట నిజమే !

ఆవిడ గుర్తుపట్టేలోపుగా ధర్మపాలుడే బైటపడ్డాడు. సునంద ఆశ్చర్యపోయింది. (కొయ్యబారలేదు) చప్పున ఆవిడనోటంట ఏమాటారాలేదు. ప్రభువువస్తాడని ఆమెకు ముందుగా తెలుసు. కానీ ఆశ్చర్యపడటం మానలేకపోయింది. ధర్మపాలుడుగూడా రవంత భయపడ్డాడు. ఆ క్షణాన - తను ప్రభువునన్న స్పృహ ఆయనకు లోపించిఉండాలి.

సునంద యథోచితమైన ఉపచారాలుచేసింది. ధర్మపాలుడు రెప్పవేయకుండా సునందవైపే చూస్తున్నాడు.

"ఏమిటి ప్రభూ !" అన్నది సునంద చిరునవ్వును అణచుకొంటూ.

"లోకంలో అందహీను లెందుకుంటారోనన్న అనుమానం మొన్నమొన్నటిదాకా నాకుండేది." అన్నాడు ధర్మపాలుడు.

'ఇప్పుడా సంశయం తీరిందా?'

'ఆహా' అన్నాడు ప్రభువు. 'సృష్టిలోని సౌందర్యమంతా, ఒకేచోట రాశీభూతం కావడంవల్ల – ఇతర సృష్టి సౌందర్యరాహిత్యమయిపోయిందికదూ?'

సునంద చెక్కిళులు సిగ్గుతో పులకరించాయి.

'కానీ,' అన్నాడు ప్రభువు. "ఆ సౌందర్యరాశి అయోగ్యునిచేతబడటమే బ్రహ్మచేసిన పొరబాటు."

సునంద మాట్లాడలేదు.

"వీరవర్మ ఇంతటి అదృష్టవంతుడని నాకు తెలియదు సునందా! నీలాంటి భార్య లభించడానికి- అత నెంత పుణ్య పురుషుడో ఎలా చెప్పడం?"

'భార్య!' అన్నది సునంద ముఖంచిట్లించి.

ధర్మపాలుడు ప్రశ్నార్థకంగా చూశాడు. సునంద ఫక్కున నవ్వింది. కొనగోటితో ముంగురులు సవరించుకొంది.

'కాదుప్రభూ!' అన్నది సునంద కొన్నిక్షణా లాగి. "నాభర్త పేరు విజయసేనుడు. పాటలీపుత్ర మహాసామ్రాజ్యంలోని ఓ చిన్న భాగానికి నాభర్త అధినేత. మేమెంతో అన్యోన్యంగా ఉండేవారం..."

అగాధాల్లోనించి జ్ఞాపకాలు వెలికి లాగుతున్న దానిలా సునంద కళ్ళుమూసుకొంది.

'ఒకసారి' అన్నది సునంద అలానే కళ్ళుమూసుకొని. "నాభర్త సభాంగణంలో ఉండి, రాజముద్రికను తెమ్మని వీరవర్మను పంపారు. దాసీజనం అన్య కార్యనియుక్తంగావటంతో, వీరవర్మ, అంతఃపురానికి రాక తప్పలేదు. నేనప్పుడు స్వర్ణదర్పణం ముందు కూచుని అలంకరించుకొంటున్నాను. ఎవ్వరూ లేరన్న ధైర్యంతో వస్త్రాదులవిషయంలో అజాగ్రత్తగా ఉన్నాను. స్వర్ణదర్పణంలో, దంతక్షతానికి గురికాబడ్డ నా చెక్కిలిని పరిశీలిస్తున్నప్పుడు ఎవరిదో, నీడ... వెనుదిరిగి చూచాను. వీరవర్మ; సిగ్గుతో కుంగిపోయాను... అతనెంతసేపటినుండి నన్నలా చూస్తున్నాడో తెలియదు. వచ్చినపని అడిగాను. చెప్పలేదు. అప్పటికే అతను స్వాధీనం తప్పినట్లున్నాడు. ఏమాటా మాటాడలేకపోయాడు ... నాకు తెలుసు. అలాంటి వికృతి విశేషం - నా భర్తలో నేనెన్నోసార్లు చూశాను. దాని ఫలితమేమిటోగూడా నాకు తెలుసు. అయితే వీరవర్మగూడానా ?...

నా కెందుకో అతనిమీద జాలివేసింది. ఈ విషయం నాభర్తతో చెప్పబుద్ధిగాలేదు. చెబితే అతను మరుక్షణంలో హాతుడవుతాడని నాకు తెలుసు. చెప్పి అతన్ని చంపించటం నా కెంతమాత్రం ఇష్టంలేదు...

"మేము పేదవాళ్ళం ప్రభూ! నన్ను మా పొరుగింటి యువకుని కివ్వడానికి నిశ్చయమైనప్పుడే, విజయసేనుడు నన్ను

చూచి, ఆ వివాహాన్ని ఆపించి, తనవారు ఎంత కాదంటున్నా వినక నన్ను పెళ్ళాడారు. ఏ సునందనుచూచి, విజయసేనుడు రాచమర్యాదనుగూడా కాలదన్నాడో, ఆ సునందనుచూసే వీరవర్మ రాజనిబంధనలను ఉల్లంఘించాడు. విజయసేనుణ్ని మన్నించి, వీరవర్మను శిక్షించనా ?

ఓరోజు రాత్రి ఎందుకో మెలకువ వచ్చింది. దిగ్గున లేచాను. మూలగా వీరవర్మ నిలబడిఉన్నాడు. పెద్దకత్తి మొలనుండి వ్రేళ్లాడుతున్నది. అతని సాహసం నన్నెంతో ఆనందపరిచింది. అతనెందుకొచ్చిందీ నేను గ్రహించాను. కేవలం నన్నుచూడాలని, కావలివారిని తప్పుకొని, అపాయకరమైన అంతఃపురంలోని నా శయ్యామందిరం ప్రవేశించాడు. విజయసేనుడు అక్కడే ఉంటాడని వీరవర్మకు తెలియకపోదు. ఈ కార్యం ప్రాణంతో చెలగాటమనిగూడా తెలియకపోదు. అయినా, అన్నింటికీ తెగించి వచ్చాడు మరి ..."

సునందకళ్లు సంతృప్తితో మెరిశాయి. ధర్మపాలుడు ససంభ్రమంగా వింటున్నాడు.

"రహాస్యం - అందునా ప్రణయరహస్యం ఎక్కువ కాలం దాగదు. నాకోసం అలమటించే వీరవర్మను, విధికి వదిలేయడం నావల్ల కాకపోయింది. శుష్కమైన ఏవో నీతిసూత్రాలను పట్టుకొని, ఓ నిండుప్రాణిని హింసపాలు చేయటానికి - నేనంత కఠినురాలను కాను. పూజ్యులైన ఆర్యులు సంచరించిన భూమిలో పుట్టినదాన్నిగానీ, మ్లేచ్ఛదేశంలో పుట్టినదాన్ని కాదుగదా !

"విజయసేనుడుగూడా అనుమానించాడు. ఒకటిరెండు సార్లు, రెప్పపాటుకాలంలో ప్రమాదంనుండి తప్పు కొన్నాం. కానీ అలా ఎంతకాలమని ? అందుకే వీరవర్మతో సహా మీదేశానికి వచ్చాను. పాటలీపుత్రరాజ్యంనుండి కొన్నివందల యోజనాలదూరంగా ఉండటానికి ఇదే ముఖ్య కారణం..."

సునంద ఫక్కున విరగబడి నవ్వింది.

"కానీ ప్రభూ ! ఈ పురుషులను చూస్తున్నకొద్దీ ఎన్నో విచిత్రమైన విషయాలు బహిర్గతమవుతుంటాయి. విజయసేనునినుండి, ప్రాణపదంగా నన్ను తెచ్చుకొన్న వీరవర్మ; ఈ సౌధంలో - దాదాపు నన్ను బంధించినంత పనిచేశాడు. మరో పురుషునికంట నేను పడకుండా, ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటున్నాడు. అతనికీ భయమేమో నన్ను గురించి !"

కొన్ని నిమిషాలు సునంద మాట్లాడలేదు. క్రింది పెదిమ కొరుకుతూ ఆలోచించింది.

"మీ కానుకలు అందిననాడే, నే నను కొన్నాను." అన్నది సునంద. "మీరాజ్యానికి, ఎనలేనిసహాయం చేసిన వీరవర్మ 'భార్య' నని తెలిసిగూడా, రహస్యంగా నాకు కానుకలు పంపారంటే, మీ గాఢానురాగం నే నర్థంచేసు కొంటాను. కానీ, వీరవర్మ మామూలు మనిషి కాడు ప్రభూ! కాడని తెలిపేందుకే, మీ కీ విషయాలు తెలియజేశాను. నాకోసం, తన రాజభక్తిని, ప్రాణాన్ని, తృణ సదృశంగా

విసర్జించ సిద్ధపడిన వీరవర్మ — మీపట్ల ఎలా ప్రవర్తించ గలడో మీ రూహించండి. కేవలం మీ క్షేమంకోరి మాత్రమే నే నీమాట లంటున్నాను. నన్ను గురించి భయ పడకండి. నన్ను తను పోగొట్టుకోలేడు. పోగొట్టుకొని జీవిం చనూ లేడు.”

నిశ్శబ్దం ఆవరించింది.

ధర్మపాలుడు తలవంచుకొని కొన్నినిమిషాలు ఆలో చించాడు. మెల్లిగా తలెత్తి సునందముఖంలోకి చూశాడు. స్వప్నాలు వెదజల్లే కన్నులు, సువర్ణకాంతులీనే చెక్కిళులు, చిరునవ్వులు చిందించే అధరాలు, సున్నని కంఠం, దుస్తుల్లో ఇమడక, తొణికిసలాడే సౌందర్యం అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఓక్షణం తల అడ్డంగాతిప్పాడు.

“లాభంలేదు. కృతజ్ఞతాకృతజ్ఞతలనుగురించి నేనిప్పుడు ఆలోచించలేను. ఏదిఏమయినాసరే, నువ్వు - నువ్వు - నాకుకావాలి...” తరువాత మాటలు వినపడలేదు. అప్పటికే సునంద అతని కౌగిలిలోఉన్నది. “ఈ పెదాలు, ఈ భుజాల కాఠిన్యం, కళ్ళల్లోని తృష్ణ, ఇవన్నీ...అన్నీ...నాకుకావాలి. ఈ ఆభరణాలు, వస్త్రాలు, అన్నీ నేనే అయి, నీశరీరమంతా ఆక్రమించుకొని, ఇంక నువ్వు బైట ఏమీలేకుండా, నాలో కలిసిపోవాలి...

మెల్లిగా ధర్మపాలుని కౌగిలి తప్పుకొని సునంద అల్లంతదూరం జరిగి, అతని కళ్ళలోకి చూస్తూ అన్నది:-

"ప్రభూ! నామీద నాకెంత అభిమానమో మీరు ఊహించుకోలేరు. పురుషుల్ని వారివారి నియమ నిబంధనల నుండి దూరంచేసే, నా అందం తలచుకొని, నేను గర్విస్తుంటాను." అన్నది సునంద. "నేను, ఈసౌఖ్యం- ఇదే ఆఖరేమో ననుకొంటాను. నన్నింక మరిచిపోండి. వీరవర్మ ఎటువంటి స్వార్థపరుడో, మీకు చెప్పాను. నన్ను-మీరైనా సరే-చూడటం సహించలేని తత్వమతనిది."

ధర్మపాలుడు నవ్వాడు.

'కావచ్చు' సునందను దగ్గరకు తీసుకొంటూ అన్నాడు. "నేనంతకన్న స్వార్థపరుణ్ణని నువ్వు గ్రహించాలి. వీరవర్మ సహాయంలేనిపక్షంలో నేను, నా రాజ్యము, ఉండేవిగావని తెలిసికూడా - నీనుండి నా మనస్సు మరలించుకోలేని నావ్యక్తిత్వం నీకర్థమయ్యే ఉండాలి. బలహీనుడు గనుక - వీరవర్మ- నిన్ను తీసుకొని పారిపోయ్యాడు. నాకా అవసరం లేదు. నేనతన్ని- ఈ దేశంనుండి మాత్రమేకాదు; ఈ లోకం నుండికూడా పారద్రోలగలను. ఇంకా ఈశరీరం...ఆ వీర వర్మ అనుభవానికి అర్పించను. ఈ పెదవులు, భుజాలు, నున్నని ఈ బాహువులు, అతన్ని తాకనీను."

పిచ్చిగా ఆమెను అదుముకొన్నాడు.

"నిన్ను స్వర్గతుల్యమైన అంతఃపురంలో, పూపాన్పుపై కూచోబెట్టి, నీ వేపుచూస్తూ, అలా చూస్తూనే చచ్చిపోతాను. నాదేవతగా, ప్రాణంగా, నిన్ను చూసుకుంటాను.

అకస్మాత్తుగా సునందముఖం వివర్ణమయింది. భయంతో ఆమె ధర్మపాలుని కౌగలించుకొంది.

"ఆ పనిమాత్రం చేయకండి" అన్నది సునంద. "నన్ను అంతఃపురాల్లోనూ; పాన్పుల్లోనూ ఉంచకండి. నన్నిలానే ఉండనీయండి."

"ఏం ?" అన్నాడు ధర్మపాలుడు అర్థంకాక.

"మీకు తెలియదా ప్రభూ ? అన్నది సునంద ఓ క్షణమాగి. "విజయసేనుణ్ణి, వీరవర్మ చంపటానికైనా సిద్ధపడ్డాడు. వీరవర్మను మీరే నిమిషంలోనైనా అంతమొందించటానికి ప్రయత్నిస్తున్నారు. ఆలాగే ... ఇంకొక రెవరైనా, నన్ను కాంక్షించి మిమ్మాపనే చేయవచ్చు. చేతులారా అపాయాన్ని కొని తెచ్చుకొంటారా ప్రభూ ?"

ధర్మపాలుడు ఉలిక్కిపడ్డాడు.

"మరొకడు నిన్ను కాంక్షించడమా? ప్రాణాలమీది ఆశతో నేనా ?"

సునంద ఛటుక్కున దూరంగా వచ్చి నిలుచుంది.

"ఒకటే అచ్చు. ఒకటే లోహం. భగవంతుడు మీ జాతిని ఒక్కవిధంగానే సృష్టించాడు. పెళ్ళికాకముందే పొరుగింటియువకుడు, నన్ను పరపురుషునికంట పడనీయనన్నాడు. తరువాత విజయసేనుడు, వీరవర్మ ... కొసకు మీరుకూడాను. మీ అందరికీ స్త్రీ కావాలి. దాని అందం కావాలి. కానీ మీరు అందంకోసం ఆరాటపడుతున్నట్లే, మరొకరుకూడా ఉంటారన్న ఆలోచనే మీకురాదు. అవ

ధులు లేకుండా మలయమారుతం, సుగంధాన్ని వెదజల్లుతో వీస్తున్నది. నీకై నువ్వనుభవించు. కావలసినంతా తీసుకో. కానీ మరొకరుగూడా అనుభవిస్తున్నారన్న, విచారము, దుగ్ధ నీకెందుకు ? ఇంకొకరు అనుభవించినంతమాత్రాన, నీకు కలిగే లోటేమీ లేనప్పుడు – ఆ విచారాన్ని ఎలా అర్థంచేసుకోవాలో నాకు బోధపడటం లేదు ..."

ధర్మపాలుడు కొయ్యబారిపోయాడు. సౌందర్యకాణాచియైన సునందకు బదులు, ఓ భయంకర రాక్షసి ఎదుట నిలుచున్నట్టు, భయంతో రెండుకళ్ళూ మూసుకొన్నాడు.